సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



ఆకాశం నుంచి పాతాళానికి..

గుర్రంకొండ మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో అత్యధికంగా రూ.6 వరకు మాత్రమే పలుకుతోంది. -IIలో



లోకక్షేమం కోసం అరుదెంచిన ఆరోగ్యమాత

మరియతల్లి దీవెనలు మానవాళిపై ఉండాలని కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలి బాలి అన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 428 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	585
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 266.060 కిలోలు

న్యూస్‌రీల్

ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ: హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రతి రోజు సూపర్‌లగ్జరీ బస్సులు సాయంత్రం 5 గంటలకు బీహెచ్‌ఈఎల్, సాయంత్రం 6 గంటలకు హైదరాబాదు–సికింద్రాబాద్, రాత్రి 8 గంటలకు హైదరాబాదు–జీడిమెట్ల, రాత్రి 8.30 గంటలకు బిహెచ్‌ఈఎల్‌కు స్టార్‌లైనర్ నాన్ ఏసీ స్లీపర్ కోచ్ నడుపుతున్నట్లు తెలిపారు.

అవార్డులకు దరఖాస్తులు

రాయచోటి అర్బన్ : పర్యాటక రంగంలో ఉత్తమ సేవలందించిన వ్యక్తులు, సంస్థలు అవార్డుల కోసం ధరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా పర్యాటక అధికారి యం .నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడలో వీటిని అందజేస్తారన్నారు. ఉత్తమ స్టార్ హోటల్, బడ్జెట్ హోటల్, ఉత్తమ గైడ్, వేసైడ్ అమెనిటీస్, టూర్ ఆపరేటర్, ట్రావెల్ ఏజెంట్, చలన చిత్రం తదితర 40 విభాగాలకు సంబంధించి ఏపీ టూరిజం అథారిటీ అవార్డులు ప్రకటిస్తుందన్నారు. అర్హులైనవారు ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు ఏపీటూరిజం వెబ్‌సైట్‌లో వివరాలను పొందవచ్చన్నారు.

నూతన నియామకం



బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్

రాజంపేట టౌన్: భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా సాయిలోకేష్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ ఉత్తర్వులు జారీ చేశారని సాయిలోకేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి తనవంతు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చిన పురందేశ్వరికి, ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

11 నుంచి తరగతులు

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం తరగతులు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అకడమిక్ టైమింగ్స్ ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు తరగతులకు హాజరుకావాలన్నారు.

తిరుపతికి ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైదరాబాదు నుంచి తిరుపతికి కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నారని రైల్వే చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ జనార్దన్ తెలిపారు. 07633/07644 నెంబరుగల రైలు ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు హైదరాబాదులో బయలుదేరి తెల్లవారుజామున 5.50 గంటలకు కడపకు చేరుకుని తిరుపతికి 10.00 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు ఈనెల 11, 18, 25 తేదీలతో పాటు అక్టోబరు 2న ఈ మార్గంలో నడుస్తుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 12, 19, 26, అక్టోబరు 3న తిరుపతి–హైదరాబాదు మధ్య నడుస్తుందన్నారు.

హలో బ్రదర్.. హాయ్ సిస్టర్

- నలుగురు వరాల బిడ్డలు
- 2012లో ఒకే కాన్పులో జననం
- లాలనలో తప్పని సమయపాలన

బి.కొత్తకోట: వారు నలుగురు ఒకేసారి పుట్టారు. వీరిలో ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు. వీరిలో ఒకరికి ఏడుపువస్తే మిగిలిన ముగ్గురికీ ఏడుపొస్తుంది. ఒకరికి విరోచనమైతే అందరికీ కలుగుతాయి..జ్వరమొచ్చినా, ఏ ఇబ్బంది కలిగినా అందరికీ ఒకేసారి అలాగే వస్తుంది. ఇది చదువుతుంటే 'హలో బ్రదర్స్' సినిమా గుర్తుకొస్తోంది కదూ. వీరిది అచ్చంగా అలాంటి కథే.. అయితే ఇది కథ కాదు.. జీవితవిచిత్రం. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలకేంద్రానికి చెందిన వీరి గురించి ప్రత్యేక కథనమిది.

ఒకే కాన్పులో..

బి.కొత్తకోటలో మొబైల్ షాపు నిర్వహకుడు పి.సైఫుల్లా దంపతులకు ఒకే కాన్పులో నలుగురు పిల్లలు జన్మించారు. తొలుత భార్య నఫీసా కడుపులో నలుగురు పిల్లలు ఉన్నారని డాక్టర్ చెప్పిన వార్తకు సైఫుల్లాపై పిడుగుపడ్డట్టయ్యింది. 'యా అల్లా ఏమిటిది' అని కంగారు, ఆందోళన అన్నీ పడ్డాడు. చివరకు అల్లా నిర్ణయానికి కట్టుబడుదాం అని సముదాయించుకున్న సైఫుల్లా ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు తండ్రి అయిపోయాడు. ఇప్పటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఒకబిడ్డను పెంచి పెద్దచేయడమంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టే. ఏ ఇబ్బంది లేకుండా వారి ఆలనాపాలనా చూడాలంటే అబ్బ ఎంత కష్టమో తల్లిదండ్రులకు ఎరుకే. చిన్నపిల్లలు ఏదైనా కావాలని పట్టుపట్టినా, ఏడుపు మొదలెట్టినా ఇక అంతే. సముదాయించేందుకు ఇంట్లో ఎందరుంటే అందరూ..ఒకరి తర్వాత ఒకరుగా చేతుల్లోకి తీసుకుని లాలిస్తారు..ఆడిస్తారు.. అలాంటిది ఏకంగా ఒకేసారి పుట్టిన నలుగురు బిడ్డల ఆలనాపాలనా చూడాలంటే..తల్లి నఫీసా పడిన కష్టం అంతా ఇంతా కాదు. 2011లో ఒకే కాన్పులో పుట్టిన నలుగురు పిల్లలు ఇప్పుడు పెద్దవారయ్యారు. వీరంతా ఒకేసారి స్కూలుకు వెళ్తారు. ఒకే తరగతిలో కూర్చుంటారు. జన్మదినం ఒకేరోజు ఒకే సమయంలో జరుపుకుంటారు. అందుకే ఈ నలుగురు పిల్లలు అందరిలో ప్రత్యేకంగా నిలుస్తున్నారు.



చిన్నప్పుడు నలుగురు పిల్లలతో సైఫుల్లా, నఫీసా (ఫైల్)

SAKSHI WEEKEND

స్కాన్‌కు అందక బెంగళూరుకు..

సైఫుల్లా, నఫీసాలు స్థానిక ఖాజాఖాన్‌వీధిలో నివాసం ఉంటున్నారు. సైఫుల్లా మొబైల్ దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. నఫీసాకు 2008లో తొలికాన్పు అయింది. అఫన్నాన్ అనే ఆడబిడ్డ పుట్టింది. 2011లో నఫీసా రెండోసారి గర్భందాల్చింది. మదనపల్లెలో వైద్యసేవలు అందిస్తుండగా ఒకరోజు డాక్టర్ స్కాన్ చేయగా అర్థంకాని పరిస్థితి ఎదురైంది. గర్భంలో ఉన్నది ఒకరా, ఇద్దరా అన్నది స్పష్టం కాలేదు. దీనిపై బెంగళూరు వెళ్లాల్సిందిగా వైద్యుల సూచన మేరకు నఫీసాను బెంగళూరులోని క్లౌడ్‌నైన్ ఆసుపత్రి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు నఫీసా గర్భంలో నలుగురు పిల్లలువున్నట్లు నిర్ధారించగా ఈ మాట విన్న సైఫుల్లా నమ్మలేక నమ్మాల్సి వచ్చింది.

ఒకరివెంట ఒకరుగా..

2011 అక్టోబర్, 22న నఫీసాకు జరిగిన సిజేరియన్ కాన్పులో నలుగురు జన్మించగా వారిలో తొలుత, చివరన మగపిల్లలు, మధ్యలో ఆడపిల్లలు పుట్టారు. తొలిగా మహమ్మద్ రెహాన్, తర్వాత వరుసగా.. బుస్రా అంజుమ్, హానియా అంజుమ్, మహమ్మద్ షయాన్ జన్మించారు. వీరుపుట్టాక కొన్నిరోజులు క్లౌడ్‌నైన్ ఆసుపత్రి గైనిక్ లీలాభగవాన్, డైరెక్టర్ కిషోర్‌కుమార్‌లు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. నెలరోజులు ఆస్పత్రిలో, నెలరోజులు బెంగళూరులోనే ఉండి బి.కొత్తకోటకు వచ్చారు. ఇంటిలో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య పిల్లల పెంపకం జరిగింది.

ఒక్కొక్కరికీ ఒక్కో సమయం

చిన్నప్పుడు తల్లి, నాయనమ్మ వీరి ఆలనాపాలనా చూశారు. పిల్లలు ఉదయం నిద్రలేవగానే పాలిస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో సమయాన్ని గుర్తుపెట్టుకుని పాలు తాగిస్తారు. తర్వాత ఉదయం 11దాకా నిద్రపోతారు. నిద్రలేచాక వారికి స్నానాలు చేయించేవారు. నిద్రపుచ్చేందుకు ఇంట్లో మూడు జోలెలు కట్టారు. వీరిని తల్లి నసిఫా, నానమ్మ హబీబ్‌జాన్ చూసుకుంటారు. పిల్లలకు ఏదైనా ఇబ్బంది కలిగితే సాయంగా చుట్టుపక్కల వారు ఇంటికి వచ్చి సహకారం అందించేవారు. పసిబిడ్డలుగా ఈ నలుగురిని పెంచి పెద్ద చేయడం నఫీసా, సైఫుల్లా పెద్ద టాస్క్. వాళ్లని చూసుకోవడం తొలుత ఇబ్బంది అనిపించినా అదే అలవాటు, దినచర్యగా మారిపోయింది. ఎన్ని పనులున్నా వీరి గురించే ఎక్కువ శ్రద్ధ చూపాల్సి వచ్చేది.

స్కూలుకు సిద్ధం చేయడమే కష్టం

పిల్లల ఆలనాపాలనా విషయంలో తల్లిదండ్రులకు ఎక్కడా ఇబ్బంది అనిపించలేదు కాని..స్కూలుకు పంపేటప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుందని తల్లి నఫీసా అంటోంది. స్కూలు సమయానికి ఒకేసారి నలుగురు పిల్లలతోపాటు మొదట పుట్టిన పాపను సిద్ధం చేయాలి. ఐదుగురికి స్నానాలు చేయించి యూనిఫాం తొడిగి, టిఫిన్ చేయించి పంపేదాకా క్షణం తీరిక ఉండదు. పిల్లల విషయంలో కష్టంగా అనిపించేది ఇదొక్కటే. పిల్లలను చూసుకోవడంలో ఎక్కడా బాధ, విసుగు అనిపించదు. వారితో ఉండటమే ఆనందం అంటోంది నఫీసా.

ఒకే తరగతిలో కలిసి..

ఈ నలుగురు పిల్లలది అన్నింటిల్లో స్పెషల్. ఇప్పుడు 12 ఏళ్ల వయసుతో పీపల్ ట్రీ స్కూలులో ఆరో తరగతి చదువుతున్నారు. తండ్రి సైఫుల్లా రోజూ వీరిని స్కూలుకు తీసుకెళ్లడం, మళ్లీ ఇంటికి తీసుకురావడం దినచర్య. నలుగురు పిల్లలు ఒకే తరగతి గదిలో ఒకేచోట కూర్చుని చదువుకుంటారు. వీరంతా ఒకేసారి సమాన తరగతి కావడం వల్ల ఒకే సిలబస్‌ను కలిసి చదువుకునే అవకాశం కలిగింది.



మహమ్మద్ రెహాన్, బుస్రా అంజుమ్, హానియా అంజుమ్, మహమ్మద్ షయాన్

ఒకేసారి బర్త్‌డే



పుట్టిన రోజు వేడుక జరుపుకుంటున్న నలుగురు పిల్లలు (ఫైల్)

నలుగురు పిల్లల బర్త్‌డే ఒకేసారి జరుపుకోవడం సైఫుల్లా కుటుంబానికి ప్రత్యేకం. అక్టోబర్ 22న నలుగురికి నాలుగు కేక్‌లను తెచ్చి ఒకేసారి జన్మదినం వేడుకలను జరపడం అదో సంబరం. ఆ రోజంతా పండగ వాతావరణమే. ఉదయం నుంచి రాత్రి వరకు ఇల్లు సందడిగానే ఉంటుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల రాకతో సందడి నెలకొంటుంది. ఒకేసారి నలుగురు కేక్ కట్ చేస్తుంటే చూడముచ్చటగా ఉంటుందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తుంటారు.

ఇబ్బంది లేదు..

"పిల్లలను పెంచే విషయంలో ఏనాడు ఇబ్బందిగా భావించలేదు. మా అత్త, ఇరుగుపొరుగువాళ్లు పిల్లలను ఎంతో ఆదరించారు. వారిని చూసుకునే విషయంలో సహకరించారు. ఒకేసారి నలుగురు పుట్టినప్పటికీ వారి బాగోగులు చూసుకోవడం దినచర్యగా మారింది. ఎవరికి ఏ సమయంలో ఏమి కావాలో అర్థం చేసుకుని అందిస్తుంటాను. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకొంటూ వస్తున్నాం. -నఫీసా, సైఫుల్లా

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

గాలివీడు: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను వారం రోజుల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం'స్పందన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిరరించాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అధికారులు సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.మండలంలో ఎక్కువగా 22–ఎ, చుక్కల భూములు, హౌసింగ్, తాగునీటి సమస్యలు ఉన్నాయని, వీటిని జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తులకు సంబంధించి వారం రోజుల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, తహశీల్దార్ దైవాదీనం, ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీలు యదుభూషన్‌రెడ్డి, గాలి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఓటరు జాబితా ఇంటింట పరిశీలన పూర్తి

రాయచోటి: జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించి అందిన క్లైయిమ్స్, అబ్జెక్షన్స్‌ను పక్కాగా పరిశీలన చేస్తున్నామని, తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తి అయ్యిందని కలెక్టర్ అన్నారు. పరిశీలన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు అందజేస్తున్నామన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్టోరల్ జాబితాను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సై అంటే సై

- కడప టీడీపీలో విబేధాలు బట్టబయలు
- కడప ఇన్‌చార్జిగా ఆర్ మాధవి
- నియామకపు ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- భగ్గుమంటున్న కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం



ఉమాదేవి, టీడీపీ కార్పొరేటర్

సాక్షి ప్రతినిధి, కడప: టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జిగా శుక్రవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి సతీమణి ఆర్ మాధవి పేరు ఖరారు చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామకపు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా కేంద్రమైన కడప టీడీపీలో అంతర్గత విభేదాలు ఒక్కమారుగా బట్టబయలయ్యాయి. ఇన్‌చార్జిగా నియమిస్తారని ఆశలు పెట్టుకున్న కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబం భగ్గుమంటోంది. స్థానికులకు అవకాశం కల్పించాలని కోరినా ఫలితం లేకపోవడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్థానికుల సత్తా ఏమిటో స్థానికేతరులకు చూపించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

కడప నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలుస్తోంది. వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థి ఎస్‌బీ అంజద్‌బాషా ఘన విజయం సాధించారు. 1999 ఎన్నికల తర్వాత టీడీపీ కడప గడపలో వరుసగా ఓటమి చవిచూసింది. 2004 నుంచి కాంగ్రెస్, తర్వాత వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ విజయదుంధుబి మోగిస్తోంది. మరోమారు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ అభ్యర్థిత్వంపై ఆ పార్టీ ఏకైక కార్పొరేటర్ జి ఉమాదేవి కుటుంబం ఆశలు పెంచుకుంది. ఆమేరకు టీడీపీ నుంచి సిగ్నల్స్ రావడంతో గ్రౌండ్ వర్క్‌పై గత కొంతకాలంగా పథక రచన చేపట్టారు. ఓటింగ్ ఎలా అనుకూలంగా పెంచుకోవాలనే దిశగా ముమ్మర యత్నాలు చేశారు. క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా మంతనాలు నిర్వహిస్తూ పలువురు క్రియాశీలక వ్యక్తుల మద్దతు కోరుతూ చాప కింద నీరులా ఉమాదేవి మామ ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి వ్యవహరిస్తూ వచ్చారు. అంతలోనే టీడీపీ ఇన్‌చార్జిగా ఆర్ మాధవిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఊహించని పరిణామంతో లక్ష్మిరెడ్డి కుటుంబం కినుక వహించింది. ఆయన మద్దతుదారులు ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమితో చూపించాలని బాహాటంగా ఆరోపణలు సంధిస్తున్నట్లు సమాచారం.



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాధవి

స్థానికతను పరిగణలోకి తీసుకోవాలని కోరినా....

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును పలుమారు కలిసి స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కడప టీడీపీ నేతలు అభ్యర్థించారు. స్థానికులను పరిగణలోకి తీసుకుని టికెట్ ఆశిస్తున్న అమీర్‌బాబు, జి ఉమాదేవి ఎవరికైనా టికెట్ కేటాయించాలని, మేమంతా కలిసికట్టుగా టీడీపీ విజయం కోసం కృషి చేస్తామని టీడీపీ నేత లక్ష్మిరెడ్డి చెప్పినట్లు సమాచారం. సామాజిక వర్గ సమీకరణ నేపథ్యంలో మైనార్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే అమీర్‌బాబును పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. బలిజలు ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటే దుర్గాప్రసాద్ లేదా హరిప్రసాద్‌లను పరిశీలించాలని, రెడ్డికి టికెట్ కేటాయించాల్సి వస్తే తమ కుటుంబాన్ని పరిగణలోకి తీసుకోవాలని లేదంటే గోవర్ధన్‌రెడ్డికి కట్టబెట్టినా తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని తేల్చి చెప్పినట్లు సమాచారం. అలా కాకుండా ఆర్ శ్రీనివాసులరెడ్డికి కట్టబెడితే పార్టీకి పనిచేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ టీడీపీ అధిష్టానం వాసు కుటుంబానికి ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టింది. అధిష్టానం నిర్ణయంతో కడప గడపలోని తెలుగు తమ్ముళ్లు రగిలిపోతున్నారు.

వ్యూహాత్మక అడుగులు వేసిన వాసు...

కడపలో ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని కట్టడి చేసేందుకు పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులరెడ్డి వ్యూహాత్మక అడుగులు వేశారని రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించేందుకు కుప్పం వెళ్తూ కడప ఎయిర్‌పోర్టు నుంచి ఆలంఖాన్‌పల్లె మీదుగా కడపలోకి ప్రవేశించాల్సి ఉండగా, ఆ కార్యక్రమాన్ని తెరవెనుక మంత్రాంగం నిర్వహించి అడ్డుకున్నారు. రింగ్‌రోడ్డు వెంబడి దేవుని కడప, పెద్దదర్గా దర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తర్వాత చంద్రబాబు జోన్–6 ప్రాంతీయ సదస్సు నిర్వహణ కార్యక్రమం ఎయిర్‌పోర్టు సమీపంలో లక్ష్మిరెడ్డి స్థలంలో ఏర్పాటు చేయాలని భావించినా, ఆ కార్యక్రమాన్ని కూడా అడ్డుకున్నారు. లక్ష్మిరెడ్డి కుటుంబం టీడీపీలో ఫోకస్ కాకుండా వ్యూహాత్మకంగా శ్రీనివాసుల రెడ్డి అడ్డుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈనేపథంలో కడప తెలుగుతమ్ముళ్లు ఇన్‌చార్జి ఆర్ మాధవికి ఏమాత్రం సహకరిస్తారో వేచి చూడాల్సిందే.!

వెలిజల్లు

- ప్రాజెక్టు పరిధిలో 41 చెరువులకు ఇప్పటికే నిండిన 24 చెరువులు
- డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞంలో పూర్తయిన తొలి ప్రాజెక్టు
- కాలువల మరమ్మతులను సైతం పట్టించుకోని టీడీపీ సర్కార్





వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ పీఎస్ గిరీషా (ఫైల్), ప్రాజెక్టు నుంచి చెరువులు, పొలాలకు వెళుతున్న నీరు

సాక్షి రాయచోటి : ఒకప్పుడు కరువు ప్రాంతంగా గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రస్తుతం జలకళకు నిలయంగా మారుతోంది. రానున్న కాలంలో పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలం అయ్యేలా కనిపిస్తోంది. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా పూర్తయిన తొలి ప్రాజెక్టు వైఎస్సార్ వెలిగల్లు. అన్నమయ్య జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలోని గాలివీడు వద్ద ప్రాజెక్టును రూపుదిద్దగా, ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.76 టీఎంసీలు నిల్వలు ఉన్నాయి. రాయచోటి మున్సిపాలిటీతోపాటు గాలివీడు, అనంతపురం జిల్లాల్లోని ఎన్‌పీ కుంట ప్రాంతాలకు తాగునీటి సమస్య లేకుండా వెలిగల్లు ప్రాజెక్టు ఆదుకుంటోంది.

రాయచోటి ప్రాంతంలో సాగునీటికి వెలిగల్లు

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టు రైతుల పొలాలకు సాగునీటిని అందిస్తోంది. శ్రీనివాసపురం రిజర్వాయర్ కూడా నీటితో కనిపిస్తోంది. వెలిగల్లు ప్రాజెక్టు కింద సుమారు 21 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి సవ్వడులు కనిపిస్తుండడంతో ఖరీఫ్‌లో సుమారు ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందించాలని అధికారులు సంకల్పించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. అంతేకాకుండా రబీలోనూ నీరందించేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన అనేక రకాల పంటలకు ప్రస్తుతం ప్రాజెక్టు ద్వారా విడుదల చేస్తున్న నీరు చాలా ప్రయోజనకరంగా మారింది. వెలిగల్లు ప్రాజెక్టు నీటితో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వెలిగల్లు ప్రాజెక్టు ఎడమ కాలువ కింద మూడు, కుడి కాలువ కింద 38 చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువ పరిధిలో ఉన్న 24 చెరువులు నీటితో నిండిపోయాయి. మిగిలిన వాటిని కూడా నీటితో నింపేందుకు అధికారులు ముందుకు వెళుతున్నారు.

కాలువలను పట్టించుకోని టీడీపీ

రాయచోటి పరిధిలోని వెలిగల్లు ప్రాజెక్టుకు సంబంధించి కుడి, ఎడమ కాలువలను టీడీపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదు. వైఎస్సార్ హయాంలోనే వెలిగల్లు ప్రాజెక్టు పూర్తి కాగా, తర్వాత కాలువల మరమ్మతులను టీడీపీ సర్కార్ వదిలేసింది. టీడీపీ హయాంలో ప్రాజెక్టులో నీరు ఉన్నా కాలువలను పట్టించుకోకపోవడంతో పొలాలకు నీరందని పరిస్థితి నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవ చూపగా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులతో కాలువల రూపురేఖలు మార్చారు. కాలువల్లో పూడిక తీతలు చేపట్టడంతో నీరు నేరుగా పంట పొలాలకు చేరుతోంది.

అన్ని సమస్యలకు పరిష్కారం

రాయచోటి నియోజకవర్గంలోని వెలిగల్లు ప్రాజెక్టు అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతోంది. పొలాలకు సాగునీరు అందిస్తున్నాం. రాయచోటి మున్సిపాలిటీకి, గాలివీడులకు తాగునీటి వరప్రసాదినిగా ప్రాజెక్టు మారింది.చెరువుల్లో నీరు నింపడం ద్వారా బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగి గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాదు. రైతులు సాగునీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాలి. - పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

సమృద్ధిగా నీరు వస్తోంది



వెలిగల్లు ప్రాజెక్టు నుంచి వచ్చిన సాగునీటి కారణంగా ఈ ప్రాంతంలో పంటలు పుష్కలంగా పండుతాయి. గతంలో పొలాలు బీడుగా పెట్టాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటితో నేను ఎనిమిది ఎకరాల్లో వేరుశనగ పంట వేసి సాగునీరు అందించడం ద్వారా మంచి ప్రయోజనాన్ని పొందాను. గాలివీడు మండలంతో పాటు గరుగుపల్లె ప్రాంతానికి సమృద్ధిగా నీరు వస్తోంది. - రమణారెడ్డి, రైతు, గరుగుపల్లె, గాలివీడు మండలం

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

రాయచోటి నియోజకవర్గానికి వెలిగల్లు ప్రాజెక్టు గుండెకాయ లాంటిది. ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో చెరువులను నింపుతున్నాం. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో అన్ని పనులు పూర్తి చేశాం. నీరు రావడానికి, ఇతర సాగు నీటి ప్రాజెక్టుల పనులు చేసేలా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. రానున్న కాలంలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించేలా కృషి చేస్తాం.-జి. శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

రాయచోటి టౌన్ : విధులు నిర్వర్తిస్తూ గుండె పోటుతో మృతి చెందిన పోలీస్ జె.సుబ్బరాయుడు (పీసీ నంబర్ 2075) కుటుంబానికి జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ మొత్తంతోపాటు పోలీసుల వితరణ ద్వారా వచ్చిన మరో రూ.2 లక్షలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏవో కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కుమారుడు దుర్మరణం

– తండ్రికి తీవ్ర గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని మండల పరిధి కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ మేదరపల్లె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు దుర్మరణం చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటిలోని ఎస్ఎన్ కాలనీకి చెందిన తండ్రీ కొడుకులు సలార్ బాషా, ఇర్ఫాన్(24) దుస్తుల వ్యాపారం కోసం మోటార్‌సైకిల్‌పై రాయచోటి నుంచి మేదరపల్లికి వచ్చారు. అక్కడ వ్యాపారం ముగించుకొని మేదరపల్లి నుంచి జాతీయ రహదారిపైకి వస్తుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇర్ఫాన్ అక్కడికక్కడే మృతి చెందగా, సలార్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన సలార్‌బాషాను చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

పెద్దముడియం : కొండపాపాయపల్లె గ్రామంలోని రామసుబ్బమ్మ(38) ఆమె కూతురు సంధ్యారాణి(20) విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. రామసుబ్బమ్మ భర్త రంగారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నేళ్ల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో రూ.25 లక్షల మేర అప్పు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మనస్తాపానికి గురైన రామసుబ్బమ్మ, సంధ్యారాణి విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించారు.

ఆకాశం నుంచి పాతాళానికి..!

- భారీగా పతనమైన టమాట ధరలు
- మార్కెట్లో కిలో రూ.6
- 15 రోజుల్లో 75 శాతానికి పైగా తగ్గిన వైనం
- పెరిగిన పంట దిగుబడే కారణం


మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటాలు

గుర్రంకొండ : మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో అత్యధికంగా రూ.6 వరకు మాత్రమే పలుకుతోంది. 15 రోజుల క్రితం రూ.20 నుంచి రూ.25 వరకు ఉన్నాయి. ప్రస్తుతం 75 శాతానికి పైగా ధరలు తగ్గిపోయాయి. జిల్లాతోపాటు బయటి ప్రాంతాల్లో పంట దిగుబడి భారీగా పెరగడమే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీంతో రోజురోజుకు ధరలు పతనమైపోతున్నాయి.

మార్కెట్‌కు భారీగా వస్తున్న స్టాక్

మార్కెట్‌లో 15 రోజుల కిందట 25 కేజీల క్రీట్ రూ.500 నుంచి రూ.625 వరకు పలికింది. అయితే వారం రోజులుగా ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం 25 కేజీల క్రీట్ రూ.150 వరకు మాత్రమే పలుకుతోంది. ప్రస్తుతం మొదటి రకం కిలో రూ.6, రెండో రకం కిలో రూ.5, మూడో రకం రూ.3 వరకు పలుకుతున్నాయి. 15 రోజుల కిందట జిల్లాలోని అన్ని టమాట మార్కెట్ మండీలకు ప్రతి రోజు 340 నుంచి 368 టన్నుల స్టాకు వచ్చేది. ప్రస్తుతం రోజూ 3250 నంచి 3465 టన్నుల వరకు వస్తోంది. దీనికి తోడు రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలతోపాటు బయట రాష్ట్రాల్లో దిగుబడులు పుష్కలంగా ఉన్నాయి. రెండు నెలల్లోనే కిలో రూ. 200 నుంచి రూ.6కు పడిపోయింది. రోజుల వ్యవధిలోనే ఆకాశం నుంచి పాతాళానికి పడిపోవడంతో.. రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే టమాటాలను మార్కెట్‌కు తీసుకొచ్చే కూలీలు, రవాణా ఖర్చులకు కుడా సరిపోవని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 3 రోజులుగా పలువురు రైతులు టమాటలను మండీలకు తీసుకొచ్చి.. తీరా వేలం పాటల్లో వచ్చిన ధరలు చూస్తే కూలీలకు చేతి నుంచి డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు.

దిగుబడి పెరగడంతో తగ్గిన ధరలు



మన జిల్లాతో పాటు బయటి ప్రాంతాల్లో టమాట పంట దిగుబడులు భారీగా పెరిగాయి. దీంతో రోజురోజుకు ధరలు తగ్గిపోతున్నాయి. 15 రోజుల కిందట వరకు జిల్లా వ్యాప్తంగా సగటున 340 టన్నుల స్టాకు అన్ని మార్కెట్లకు కలిపి వచ్చేది. ప్రస్తుతం రోజూ సగటున 3450 టన్నులకు పైగా వస్తోంది. దీంతో 15 రోజుల ధరలతో పోల్చితే ప్రస్తుతం 75 శాతానికి పైగా తగ్గిపోయాయి. – జగదీష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

● పశువులకు మేతగా..



ములకలచెరువు : నెల రోజుల క్రితం టమాట ధరలు ఆకాశాన్నంటాయి. కిలో రూ.200లు, రూ.300ల వరకు ధర పలికింది. ఇప్పుడేమో 30 కిలోల బాక్సు ధరలు చూస్తే కనీసం ఇటు కూలీ, అటు రవాణా ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. దీంతో ఆగ్రహించిన రైతులు టమాటలను రోడ్డు పక్కన పారబోసి పశువులకు మేతగా వేస్తున్నారు. ఈ ఘటన ములకలచెరువు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది.

హత్య కేసులో మరో నలుగురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : ఆటో డ్రైవర్ సుధాకర్ హత్య కేసులో మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణం కోటపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్ద గత నెల 31న ఇందిరమ్మ కాలనీకి చెందిన సుధాకర్‌ను విషంతో కూడిన సూదులతో గుచ్చి హత్య చేసిన కేసులో ఇది వరకే ఆరుగురిని అరెస్ట్ చేయడం విదితమే. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో నలుగురి నిందితులను శుక్రవారం తిరుపతిలో అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. శుక్రవారం అరెస్ట్ అయిన వారిలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం గోవిందపురానికి చెందిన తమ్మినేని రవికుమార్ (41), తిరుపతి టౌన్ ప్రకాషం రోడ్డులో నివాసం ఉంటున్న కారుపర్తి భానుచందర్ (32), కృష్ణా జిల్లా బాపులపాడు హనుమాన్ జంక్షన్‌కు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్ (39), గుంటూరు జిల్లా మంగళగిరి తిప్పలబజార్‌కు చెందిన షేక్ సలీమ్ (60) ఉన్నారు. వీరిని పీలేరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హాజరు పరిచారు. అనంతరం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు పంపారు. సమావేశంలో ఎస్ఐలు నరసింహుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

లోకక్షేమం కోసం అరుదించిన ఆరోగ్యమాత

ఘనంగా ముగిసిన జయంతి వేడుకలు



దైవ సందేశం అందజేస్తున్న బిషప్ గాలి బాలి, ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప కల్చరల్ : ప్రపంచమంతా మరియతల్లి గురించి తెలియని వారుండరని, ఆమె దీవెనలు ఈ జయంతి సందర్భంగా మానవాళిపై సంవృద్ధిగా వర్షించాలని కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ గాలి బాలి అన్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మరియతల్లి జన్మదిన వేడుకల ప్రత్యేక దివ్యబలి పూజను జిల్లాలోని గురువులతో కలిసి సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ మరియతల్లి తన బిడ్డల అవసరాలను గుర్తెరిగి, వారు కోరక ముందే సహాయం అందిస్తారని, దీవెనలతో రక్షిస్తారని తెలిపారు. ఆమె మహిమలను మరింత పదిలం చేసేందుకు క్రీస్తు ప్రభువు.. మానవులందరి తల్లిగా భావించి యోహానుకు అప్పగించారని, నాటి నుంచి మరియ మనతో మన కుటుంబాలలో కొలువై ఉన్నారని తెలిపారు. పేదలకు దానం చేయడం దైవానికి కానుకలు అర్పించినట్లేనని, ప్రతిఫలంగా మనకు దేవుడు మేలు చేస్తాడని తెలిపారు. ప్రార్థనలకు ముందు బిషప్‌ను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో మంగళ వాయిద్యాలతో గురువులు, చర్చి పెద్దలు ప్రార్థన స్థలానికి ఆహ్వానించారు. ప్రార్థనలనంతరం బిషప్‌ను శాలువా పూలమాల శాంతి సేవా సొసైటీ జ్ఞాపిక, అరుళయ్య కరుణయ్య పుస్తకంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెవ ఫాదర్ సంబటూరు సురేష్ రచించిన పూజా సమయం పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. రెవ ఫాదర్ బాకీ రవీంద్ర పర్యవేక్షణలో స్తుతి గీతాల ఆలాపన జరిగింది. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణం లోనూ, వెలుపల తిరునాల సందడిగా కనిపించింది. దుకాణాలు రద్దీగా మారాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రైస్తవ పాటలతో చెక్కభజనలు నిర్వహించారు. అనంతరం మరియ తల్లి పతాకాన్ని అవరోహణ చేసి కార్యక్రమాలకు ముగింపు పలికారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఎండీ ప్రసాద్ రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మేత్రాసన కోశాధికారి ఫాదర్ పెండ్లికట్ల దేవదాస్, మల్టీ పర్పస్ సోషల్ సరీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, పుణ్యక్షేత్ర సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ప్రొద్దుటూరు డీన్ గురువులు విజయబాబు, జిల్లా నుంచి వివిధ సంస్థల గురువులు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, తిరునాల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

అత్త కుటుంబంపై అల్లుడి దాడి



గాయపడిన చాంద్‌బీ, జాఫర్‌వలీ

మదనపల్లె : కుమార్తెపై వేధింపులు ఆపాలంటూ ప్రశ్నించడంతో.. అత్త కుటుంబంపై అల్లుడి కుటుంబ సభ్యులు దాడి చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామర్రిపల్లె పంచాయతీ బాలాజీనగర్‌కు చెందిన చాంద్‌బీ(47) తన కుమార్తె గౌసియాను స్థానికంగా నివాసం ఉన్న దావూద్‌కు ఇచ్చి పెళ్లి చేసింది. వారికి ముగ్గురు సంతానం కలిగారు. దావూద్ డ్రైవర్‌గా పని చేస్తూ ఎక్కువ కాలం విదేశాల్లోనే ఉండేవాడు. ఇటీవల స్వదేశానికి వచ్చిన ఆయన తిరిగి విదేశానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అల్లుడిని విదేశానికి వెళ్లకుండా స్థానికంగా ఉంటూ భార్యాపిల్లలను చూసుకోవాలని చెప్పేందుకు.. అత్త చాంద్‌బీ, తన కుమారులు జాఫర్‌వలీ(29), చాంద్‌బాషా(26)లతో కలిసి దావూద్ ఇంటికి వెళ్లింది. అత్త మాటలను వినిపించుకోని అల్లుడు దావూద్ తనకు రూ.2 లక్షల నగదు, బుల్లెట్ బండి, ఐదుతులాల బంగారం ఇస్తే వెళ్లకుండా ఇక్కడే ఉంటానంటూ అదనపు కట్నం డిమాండ్ చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దావూద్ అన్న మౌలాసాహెబ్ కత్తి తీసుకుని అత్త చాంద్‌బీ, ఆమె కుమారులు జాఫర్‌వలీ, చాంద్‌బాషాలపై దాడి చేశాడు. దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘర్షణలో దావూద్ తల్లి తాహీరున్నీసా స్వల్పంగా గాయపడింది. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో మహిళ మృతి

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం పాము కాటుతో తుమ్మలూరు పద్మావతి(45) అనే మహిళ మృతి చెందింది. పద్మావతి కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లిన వెంకటసుబ్బారెడ్డి భార్య పశుగ్రాసం కోసుకుంటుండగా పాము కాటుకు గురైంది. దీంతో సమీపంలోని అనంతపురం వద్ద గల యానాదుల వద్దకు చికిత్స నిమిత్తం తీసుకురాగా వారు తమ చేతకాదని చెప్పడంతో.. అక్కడి నుంచి ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు చాపాడు పోలీసులు తెలిపారు.

మోడల్ స్కూల్ టీచర్ ఉద్యోగాల పేరిట టోకరా

- టీజీటీగా ఫేక్ ఐడీ కార్డు
- పలువురి వద్ద డబ్బు వసూలు



బి.ఆంజనేయులు నాయక్ పేరుతో ఫేక్ ఐడీ కార్డు

కురబలకోట : మోడల్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ బి.ఆంజనేయులు నాయక్ పేరుతో ఓ మోసగాడు పలువురిని మోసగించిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఆధార్ కార్డును బట్టి ఇతనిది పెద్దమండ్యం మండలం ముసలికుంట ప్రాంతంగా తెలుస్తోంది. బాధితుల కథనం మేరకు.. బి.ఆంజనేయులు నాయక్ పేరుతో ఓ వ్యక్తి ఫేక్ ఐడీ కార్డు సృష్టించుకున్నారు. ఈఐడీ నంబరు 1155263గా ఉంది. టీజీటీ తెలుగు టీచర్‌గా కురబలకోట మోడల్ స్కూల్‌లో పని చేస్తున్నట్లుగా ఐడీ కార్డులో ఉంది. ఎంఈఓగా ఎస్ఆర్ రెడ్డి అనే సంతకం ఉంది. ఇక్కడ ఎంఈఓగా ద్వారకనాథ్ ఉన్నారు. దీన్ని బట్టి పథకం ప్రకారం ఫేక్ ఐడీ కార్డు సృష్టించుకుని అభ్యర్థులను మోసం చేసినట్లు వెల్లడవుతోంది. శుక్రవారం తిరుపతి నుంచి ఓ అమ్మాయి టీచర్ ఉద్యోగం కోసం నేరుగా కురబలకోట మోడల్ స్కూల్‌కు రావడంతో అక్కడి ప్రిన్సిపాల్‌తో సహా టీచర్లు అవాక్కయ్యారు. దీంతో ఈ మోసగాడి బండారం కాస్తా బయటపడింది. తన నుంచి రూ.15 వేలు ఫోన్‌పే వేయించుకున్నట్లు ఆమె చెబుతోంది. మరొకరు రూ.50 వేలు నగదు చేతికి ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇతను డబ్బు తీసుకోవడం, లావాదేవీలు చేయడం కూడా మోడల్ స్కూల్‌లో నుంచి స్కూటర్‌పై బయటకు వచ్చినట్లుగా బిల్డప్ ఇచ్చేవాడని బాధితులు చెబుతున్నారు. మోడల్ స్కూల్ ముందున్న హైవే రోడ్డుపై అటు ఇటు తిరుగుతూ ఫోన్‌లో టీచర్ పోస్టు కోసం మాట్లాడినట్లు నమ్మించాడని చెబుతున్నారు. ప్రస్తుతానికి మోసపోయిన వారు కొందరే బయటపడుతున్నారు. నిరుద్యోగులకు టీచర్ పోస్టు ఇప్పిస్తానంటూ ఇతనే ఫోన్ చేసినట్లు వెల్లడవుతోంది. కొందరు మా నెంబరు మీకు ఎలా తెలుసు అని అడిగితే నాకు అంతా తెలుసని చెప్పేవాడని మోసపోయిన వారు చెబుతున్నారు. దీన్ని బట్టి అధ్యాపక రంగానికి చెందిన వ్యక్తే ఇలా మోసం చేస్తుండవచ్చని భావిస్తున్నారు. ఇతని మొబైల్ నంబరుకు ఫోన్ చేస్తే సమాధానం లేదని చెబుతున్నారు. ఇతని బారిన పడి ఇంకా ఎంత మంది మోసపోయారన్నది విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. ఇతనిది తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముసలికుంట వద్ద బండ్రేవు దగ్గరున్న షేకేనాయక్ తండాగా ఆధార్ కార్డు ద్వారా తెలుస్తోంది. ఈ విషయమై ఎంఈఓ ద్వారకనాథ్‌ను వివరణ కోరగా.. ఫేక్ (నకిలీ)ఐడీ కార్డుతో మోసం చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. ఇతను ఎవరో మోసగాడు.. ఎవ్వరూ నమ్మవద్దని తెలిపారు. ఇదే విషయమై ముదివేడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజన గాంధీని విచారించగా తమ స్కూల్‌లో ఈపేరుతో ఏ టీచర్ లేరన్నారు. మోసగించడానికి తమ స్కూల్ పేరు వాడుకున్నాడని వెల్లడించారు. ఇలాంటి వారిని నమ్మవద్దని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

నలుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్యకు ప్రయత్నించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన సి.రామచంద్రారెడ్డి (55) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లె మండలం అమ్మచెరువుమిట్ట బృందావన కాలనీకి చెందిన పి.కారుణ్య (20) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బి.కొత్తకోట మండలం గొల్లపల్లికి చెందిన నరసింహులు భార్య చంద్రకళ(29) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పుంగనూరు మండలం ఊటవారిపల్లెకు చెందిన జి.రెడ్డప్ప(40) కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా సంఘటనలో బాధితులను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

కేవీపల్లె : హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ పీలేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని బండవడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు 2020 ఏప్రిల్ 4న డబ్బుల విషయమై అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్‌పై కత్తితో దాడి చేశాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి నిందితుడు శ్రీనివాసులకు ఏడాది జైలుశిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు


గాయపడ్డ బాలకృష్ణశాస్త్రి

కురబలకోట : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలంలో కారును లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు రాష్ట్రం కంచికి చెందిన ఎం.విజయమనోహరన్ (47) గురువారం రాత్రి బండలలోడుతో అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి తమిళనాడుకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం మండలంలోని దొమ్మన్నబావి వద్ద వస్తుండగా.. కల్వర్టు పనులు జరుగుతున్న ప్రదేశంలో ముందుకు వెళ్లలేక ఓ కారు అప్పటికే మట్టిలో కూరుకుపోయి ఆగి పోయింది. ఇది గమనించని లారీ డ్రైవర్ కారును ఢీకొట్టాడు. దీంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ విజయ్ మనోహరన్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో పీటీఎం మండలం మల్లెలకు చెందిన టి.బాలకృష్ణ శాస్త్రి (65) కారులో మదనపల్లెకు వెళుతూ లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇతను కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ శాస్త్రిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముబీన్‌తాజ్ తెలిపారు.

బస్సు ఢీకొని..

మదనపల్లె : బస్సు ఢీకొని కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని గ్యాస్‌గోడౌన్ వద్ద ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కురబలకోట మండలం కనసానివారిపల్లెకు చెందిన ఎస్.మగ్బూల్(40) ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వస్తుండగా.. మార్గంమధ్యలోని గ్యాస్‌గోడౌన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్.మగ్బూల్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలవ్యాను ఢీకొని..

కలికిరి : పాలవ్యాను ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేవీ పల్లి మండలం నూతనకాలువ పంచాయతీ పూలకుంట వారిపల్లికి చెందిన నంద్యాల రామచంద్ర ఈ నెల 6న బుధవారం సాయంత్రం కలికిరి వైపు నుంచి పీలేరుకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన పాలవ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్రకు తీవ్ర రక్త గాయాలు కాగా పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. క్షతగాత్రుని తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు.. ప్రమాదానికి కారణమైన పాలవ్యాను డ్రైవరు పీలేరు మండలం బోడుమల్లువారిపల్లి గ్రామం వినాయక నగర్‌కు చెందిన గోవిందు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కొండప్ప తెలిపారు.

చెట్టుకొమ్మ విరిగిపడి..


తీవ్రంగా గాయపడ్డ లక్ష్మీనారాయణరావు

మదనపల్లె : చెట్టుకొమ్మ విరిగిపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించిన సంఘటన శుక్రవారం రామసముద్రం మండలంలో జరిగింది. గుంతయంబాడి గ్రామానికి చెందిన కె.లక్ష్మీనారాయణరావు(62), టీచర్ మల్లికార్జునతో కలిసి ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి రామసముద్రంకు బయలుదేరారు. మార్గంమధ్యలో పత్తెమ్మగారిపల్లె వద్ద రోడ్డుపక్కన ఎండిపోయిన చింతచెట్టు కొమ్మలు ద్విచక్రవాహనంలో వెళుతున్న ఇద్దరి మీద పడ్డాయి. ఆకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో టీచర్ మల్లికార్జున హెల్మెట్ ధరించి ఉండటంతో ఎలాంటి గాయాలు కాలేదు. వెనుక కూర్చొని ఉన్న లక్ష్మీనారాయణరావు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడ్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు.

ఘనంగా దర్గా మాతాజీ ఆరాధనోత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ పరిధి శ్రీ సద్గురు సాయి నగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గా మాతాజీ 19వ నవదశ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సమర్థ సద్గురు దర్గా మాతాజీ సమాధి మందిరం వద్ద ప్రార్థనలు, గురుపూజ, నవగ్రహ పూజ, రక్ష బంధన, కలశం, రుద్రాభిషేకం భక్తులు అందరి చేత జరిపించారు. అనంతరం మంగళహారతి, తీర్థ ప్రసాదాలతో ముగించారు. సాయంత్రం శ్రీ లలితా సహస్రనామ పూజ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుంటే వివాహం, సంతానం, ఆర్థికం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.